# దేవాలయములు

ASK01T192

రచయిత:

ఆర్ష విద్యాలంకార

శ్రీ కల్లూరి చంద్రమౌళి

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్. గారిచే

ప్రకటింపబడినది.

1979

**Subsidised Price: 0—20 Paise only.**

చెడ్డవారిశక్తి చేటునకే కారణము

మూర్ఖత సకల వినాశకరము

ఇతరులను పరిహసింపరాదు

గొప్పవారితో స్పర్థపడరాదు

దీర్ఘవైరము కలవానికి కోపము కలిగింపరాదు

కృతఘ్నత మహాదోషము

కోపము కలవారితో సంబంధము అనర్థదాయకము

ఆపదలో ఆదుకొన్నవాడే ఆప్తుడు

తల్లిదండ్రులు, గురుదైవసమానులు

అన్నము పరమాత్మస్వరూపము; దానిని నిర్లక్ష్యము చేయరాదు.

విద్యవలన వినయము, వినయమువలన పాత్రత దానివలన మానవుడు ఇహపరసుఖములు పొందగలడు.

# దేవాలయములు

రచయిత:

ఆర్ష విద్యాలంకార

శ్రీ కల్లూరి చంద్రమౌళి

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ.ఏ.ఎస్. గారిచే

ప్రకటింపబడినది.

1979

# దివ్యప్రసాదము

* * *

దేవాలయములు భక్తిభావ ప్రబోధ కేంద్రములు. మానవ జీవిత క్షేత్రమున-ఆధ్యాత్మిక భావ మందారముల విరియించు దివ్య కల్ప తరువులు.

భారతీయ దేవాలయ సర్వస్వమునకు ప్రాతినిధ్యము వహించిన దివ్య సీమగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవాలయము తిరుమల తిరుపతి కొండపై విరాజిల్లు చున్నది. కలియుగ ప్రత్యక్ష దైవముగా – ఈ క్షేత్రమున భక్తాభీష్టప్రదుడై వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి "దివ్య ప్రసాదము" గా దేవాలయముల పరమాశయములను ప్రతిఫలించెడి యీగ్రంథము తిరుమల తిరుపతి దేవాలయ పాలక వర్గము వారిచే భక్తలోకమునకు సమర్పింప బడుచున్నది.

★

# సత్సంకల్పము

శ్రీ బృందావనం రంగాచార్యులు, పండితులు.

వై. ఆర్. హైస్కూల్ : పరుచూరు.

* * *

కాల కరాళ లీలలకు
కగ్గక పావన హైందవాగమ
శ్రీల బల ప్రభావమున
జీవిత సార్థకతన్వెలార్చు దే
వాలయ పుణ్యసీమలు మ
హత్తర దైవిక శక్తికిన్ సదా
మూలము తానహెూ! నయన
మోహన సంపద ద్రవ్వి పోయుచున్.

" యస్య స్మరణ మాత్రేణ సంసారబంధనాత్
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే."

జన్మ సఫలత గనుటకు విష్ణునామ సంస్మరణమున కన్న మిన్నయైనదేమియు లేదు. భవప్రయోజన సంసిద్ధిని గోరినవారు- ఆ పురుషోత్తమునకే నమస్కరింప వలయును.

" వరగోవిందకథా సుధారస మహా
వర్షోరుధారా పరం
పరలన్గాక బుధేంద్ర చంద్ర! యితరో
పాయాను రక్తింబ్రవి
స్తర దుర్దాంత దురంత దుస్సహ జను
స్సంభావితానేక దు
స్తర గంభీరకఠోరకల్మష కన
ద్దావానలంబాఱునే!"

పరమేశ్వర సంప్రార్థనకు - సమర్చనకు గల మహిమల నీరీతిని మనవారభి వర్ణించిరి.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మ నివేదనమ్."

భగవ దనుగ్రహ ప్రాప్తికి సాధన భూతములగు నవవిధ భక్తివైఖరుల యంతరార్థములు సైత మీ పరమార్థమునే ప్రబోధించుచున్నవి.

నరుడు భగవత్పూజాపరుడు గావలయును. పరంధాముని నామ సంకీర్త నానురక్తుడు గావలయును. నాడే-ఐహి కాముష్మిక ప్రయోజనముల నాత డార్జింప నర్హుడుకాగలడు—తద్భిన్నముగ జిత్త ప్రవృత్తి నన్యాయత్త మొనర్చి మత్తుడై, మానవు డున్మత్తతం జరించిన తఱి కించిత్తేని జీవితాశయము సిద్ధింపదని వేత్తలెల్లరెలుగెత్తి చాటిరి.

"భజగోవిందం మూఢమతే"

మున్నగు దివ్యసూక్తులం దీ సత్యసందేశమే వెలుగొందు చున్నది. భగవ ద్విషయి కానుభూతితో నంతరంగమును బరిపుల్లము గావించుకొని, సత్య, ధర్మ దయాశౌచ సంపత్తితో-సర్వేశ్వర చరణ సంస్మరణలో జనులు సార్థక జీవను లగుట కొఱకై మన ఋషి ప్రవరులు వివిధ పథముల బ్రదర్శించిరి. అందెద్ది యేనియు మేలిమి బంగారు బాటయే కాగలదు.

వానిలో విగ్రహారాధన మొకటి. పరమేశ్వరుని ప్రతిబింబములగు ప్రతిమ లను భక్తిప్రపత్తులతో నర్చించి, వాంఛితార్థముల నందు వైఖరి పుణ్య భారతమునం దనాదిగ వచ్చుచున్న స్తవనీయ సంప్రదాయము.

విగ్రహారాధనమునకు దేవాలయములు మూలస్థానములు. దేవాలయము భారతీయ జీవిత రీతికి మంగళమునుగూర్చు మంత్ర ప్రభావ సమన్విత భద్రపీఠము. ఆగమ, శిల్ప శాస్త్ర పాండిత్యముల సమష్టి సమన్వయ ఫలరూపము దేవాలయము.

కోవిదుడై-సిద్ధహస్తుడైన శిల్పి శిలలలో జీవ కళలను జిలికి, భగవానుని మూర్తి కల్పన మొనర్చును. ఆగమ శాస్త్ర ధర్మమర్మ వేత్తయగు విద్వన్మణి ఆ ప్రతిమకు-అనుష్ఠానబలముచే ప్రాణ ప్రతిష్ఠ గావించును. అప్పుడా విగ్రహము జీవకళాతేజమును జిందును. శాస్త్ర సమ్మతములైన సత్కలాపములతో బ్రతిష్ఠితమైన ఆప్రతిమ దేవాలయమున భక్తకోటికి దర్శన మొసంగుచు, దైవిక శక్తులను బ్రసరించు చుండును. మన దేవాలయములలో కొన్ని స్వయంవ్యక్తములైన దైవమూర్తుల కాలయములైనవియును గలవు.

శిల్పి ప్రతిభ-ఆగమ పండితుల దీక్షాదక్షత-నిత్యార్చనాపరుల నియత పూజా విధాన పరంపర-దేవాలయ మహిమకు ప్రాతిపదికలు. ఇట్టి భగవదాలయములు భరతఖండమున-ఆధ్యాత్మిక సుధను జాల్వాఱ జేయు జీవనదులై, భక్తకోటికి అమరత్వమును బ్రసాదించుచున్నవి. జనుల సాంఘిక జీవితమున వీనికిగల ప్రాధాన్యము-వీని మూలముగా లోకకల్యాణమనుసంధింప బడినవను వైఖరి-సర్వదా గమనార్హములు. ఈ పుణ్యక్షేత్రములే పవిత్రాశయ సంసిద్ధి కొఱకై ప్రజ్ఞాన బలసంపన్నులైన మహనీయులచే సృజింపబడినవనునది అనుభవమునకు దెచ్చుకొనుట యనిన మన భారతీయ చరిత్రలోగల ప్రతిభామయములగు పుటలను బఠించుటయే కాగలదు. "దేవాలయములు" అనెడి యీ పుస్తకమునం దట్టి దివ్య యత్నము కొనసాగింపబడినది.

"దేవాలయములు" లలితకళలకు – సంస్కృతికి – పోషణ కేంద్రములు. విజ్ఞాన ప్రజ్ఞానములకు గురుకులములు.................................భౌతికాధ్యాత్మిక వికాసములకు కీలకములు. సంఘీభావమున కాయువు పట్టులు–పవిత్ర ప్రేమకు నిలయములు. ఆది దేవసాక్షాత్కార సంపత్తికి అఖండ వేదాంత జ్యోతి సందర్శనమునకు–ఆధార ప్రాయములు.

ఏ తద్గ్రంథరచనలో రచయితకు గల పరమాశయము లివ్వి. వీని నీరితిగ బేర్కొని, యేలనట్లు నిర్వచింపవలసి వచ్చెనో విశదీకరింప బూనుటతో- "దేవాలయములు" — అను పొత్తము రూపెత్తినది. ఆధ్యాత్మిక చింతనానురక్తిగల రాజుల

గాథలు – వేదవీచికల దేలియాడిన మహర్షుల భావవైభవ ప్రభావములు – సచ్చిదానంద పరబ్రహ్మమును నయనములముందు సాక్షాత్కరింపజేసికొని, తద్రూప లీలావిలాస మును జీవకళా ప్రాఢిమతో శిలలమీద పోగరలతో పొదిగిన సిద్ధశిల్పుల హస్త విన్యాస కౌశలములు – పారంగతత్వమును బడసిన ఆగమపండితుల దేవయజన క్రియానైపుణీ విశేషములు – వరుస వరుసగా నిందభివర్ణితమగుట గమనింతుము. అట్టి తరి – ఈ చిన్నగ్రంథము దేవాలయముల చరిత్రయా? శిల్ప శాస్త్ర చరిత్రయా? ఆగమ శాస్త్ర చరిత్రయా? ఆయా కాలముల ప్రభువుల ప్రకృష్ట చరిత్రయా? అనిపించును. సర్వరంగ సమన్వయమునకు కేంద్రముగ దేవాలయమును జిత్రింపబూనిన రచయిత కృషి సఫలమైనది.

పల్లవులు, చోళులు, తంజాపురీశులు దేవాలయముల కెట్టి సేవజేసిరో విశదీక రించెడి ఘట్టములు హృద్యములై, పాఠకులచే నాయా ప్రభువులకు జోతలు పెట్టించును.

దేవాలయ సృష్టిలోగల వివిధ వైఖరులు – విమానగోపుర గర్భగృహ ముఖ మంటపాదుల యంతరార్థములు – దక్షిణభారత దేవాలయ శిల్పమునంగల సర్వ సామాన్య సామ్యములు, మున్నగువానిని బఠించునపు డీ రంగమున నెలకొనియున్న విశిష్టరహస్యము లబ్బురము గూర్చును. దక్షిణ భారతమునగల వివిధ ప్రసిద్ధ దేవాలయముల సంక్షిప్త సమగ్ర చరిత్రయు ఇందనుబంధముగ జేర్పబడుట గ్రంథము నకు నిండుదనమును దెచ్చెను.

దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యావర్యులుగా – భారతదేశమునగల సుప్ర సిద్ధ దేవాలయ వైభవ సంపదను – శ్రద్ధాభక్తులతో దర్శించి-అనుభూతికి దెచ్చుకొని – శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు; దేవాలయముల మహిమాన్విత గాథను – ఆర్షధర్మ ప్రతిభను – అపూర్వ శిల్పగరిమను చిత్రించి తమ లలిత వచన రచనకు సాఫల్య మును సంపాదించుకొనుటేకాక – ఆర్ష విద్యాలంకార బిరుదము సన్వర్థము గావించు కొనిరి.

గతమున రామాయణ సుధాలహర్యాది గ్రంథములలో పరిమళించిన వారి గద్య కవితా ప్రతిభ – గ్రంథమున ఫలవంతమైనది.

ఇట్టి గ్రంథముల బెక్కింటిని – ఆధ్యాత్మిక భావ సముద్దీప్తికొఅకు వీరిలేఖిని నుండి పాఠక లోకమాశించుచుండును. తిరుమల శ్రీనివాస ప్రభువు దివ్యాను గ్రహము; భక్తజన వాంఛితముల ఫలింపజేయుగాక!

భక్తి ప్రపత్తుల జిత్తమున హత్తుకొన జేసెడి ఇట్టియుత్తమ గ్రంథముల ప్రచురణకు సంకల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకవర్గము వారి సత్సంకల్పము అత్యంత శ్లాఘనీయము.

ఏతాదృశ దివ్యభావ సమన్విత కవితా గంగ, మహోత్తుంగ తరంగ భంగిమతో శేషాద్రి శిఖర సీమలనుండి విశ్వమానవ కేదారములపై ప్రవహించి వినూత్న సత్యసందేశ సస్యముల వెలయు జేయుగాక!!

లోకా స్స మస్తా స్సుఖినోభవంతు.

*

# దేవాలయములు

*****

చరిత్రకందని అతిపురాతన కాలమునుండియు, భారతదేశము సిరిసంపదల కాలవాలమై యలరారుచుండెడిది. ఇది – సకల శాస్త్రములకు, కళలకు జన్మస్థానమైనట్టిది. ఆధ్యాత్మికచింతనమునకు ఆయువుపట్టు. ఇంతయేల పాశ్చాత్యులు మన దేశమున కాలిడిననాడును, భారతమాత ఈ త్రివిధసంపదలకు భాండారముగ వెలుగొందుచునేయుండెను. ఆధ్యాత్మిక ప్రజ్ఞానమున – విజ్ఞానార్జనమున – చిత్రవిచిత్ర వస్తు నిర్మాణ కౌశలమున సర్వప్రపంచమును తలదన్నుచునేయున్నది. ఈస్టు ఇండియా కంపెనీ నెలకొన్నపిదప, మనదేశమునకు ఆంగ్లేయులు ప్రభువులైరి. వారు మన భౌతికసంపదలను కొల్లగొట్టిరి. మన విజ్ఞానమును నిరసించిరి. మన శీలసంపత్తిని, ఆత్మవికాసమును చీదరించుకొనిరి. ధనార్జనమునుగావింప మనదేశములో తమ గిడ్డంగులను యంత్రాగారములను స్థాపించుకొనిరి. అధికారబలముతో, దౌర్జన్యపూరితముగ మనలను కొల్లగొట్టి, మనసంపదనంతను తమదేశమునకు దోచుకొనిపోయిరి. భారతీయ భౌతికస్వరూపమునకేగాక – పవిత్ర ఆధ్యాత్మిక స్వరూపమునకుగూడ వారి యుద్ధతి వైకల్యమును గూర్పనుంకించినది. ఇంతేగాదు – మానవజీవితమునకు విలువల నందించు ఉన్నతసత్యములను సైతము వారు నిరాకరించిరి. నీతిని తృణీకరించిరి. ఆధ్యాత్మికమును నిరసించి కుయుక్తులతో కుట్రలు గావింపసాగిరి. క్షణికాకర్షణములను జూపెట్టి, మనజాతిని పతనమొనర్చిరి. ఆంగ్లవిద్యావిధానమునకు వశ మొనర్చిరి. ఆంగ్లేయుల ననుకరించు బానిసజాతిగ గావించు కృషికి గడంగిరి. ఇట్లు మనలను హీనస్థితికి దెచ్చిన విషాదగాథ నంతయు వివరించుట కిది యదనుగాదు. జర్మనులు పరానువారు మన సంస్కృతభాషను పఠించి, ఆ వాఙ్మయములో పరిశీలనా పరిశోధనములను గావించిరి. అందలి అమూల్యములగు రత్నములను వెలికిదీసిరి. ఆవల కొందఱు ఆంగ్లేయులును, ఇతర పశ్చిమ దేశీయులును ఈ కృషియందు నిమగ్నులై అడుగునబడియున్న మన విజ్ఞానమును పైకిదెచ్చిరి. ఆంగ్ల విద్యానాగరికతా వ్యామోహపరులగు పెక్కురు భారతీయుల మైకమును పోనాడి, వారి కన్నులను దెరచుటకు

వీరికృషి దోహద మొనంగినదియును వాస్తవమే! పెక్కు శ్రమలకును, ధనవ్యయ మునకునులోనై, ప్రాచ్యవిజ్ఞానము నార్జించిన పాశ్చాత్యులలో చాలమంది తమ బుద్ధి కుచిత రీతిని తమ కందుబాటులో నున్న స్వల్ప సాధనములతో నిశిత విమర్శనము లను గావించిరి.

అయినను—కడచిన రెండు శతాబ్దములనుండియు పాశ్చాత్య పండితులు ప్రాచ్య విజ్ఞానమునుగూర్చి పరిశీలనా పరిశోధనములను గావించుచున్నను, వారు తమ దృక్పథమునే గీటురాయిగ నిడుకొని, ఆ కాలమున తమ దేశములందు ప్రాబల్యమును వహించుచున్న భౌతికవాదము, నాస్తికవాదము, సందేహవాదము మున్నగువాని ఫలితమైన చిత్త వికార పరిణామమునకు గురియగు శిక్షణమును బడసి, తదనుగుణ ముగనే తమ కృషిని సాగించిరి. వారి ననుకరించిన భారతీయులు, పాశ్చాత్యపండితుల నిర్ణయములకు తలలొగ్గిరి. ఇట్టి వీరుగావించిన పెక్కు నిర్ణయములను నిరాకరించుట యందే హిందువుల మత సంస్కృతుల నిజతత్త్వమును, యదార్థ స్వరూపమును ప్రకటింపగలమని నుడువుట అతిశయోక్తి గాజాలదు. సత్యదూరమును గాదు.

మన ఆదర్శములకు, ఆచారములకు, పరిసర వాతావరణ పరిస్థితులకు, సంస్కృతికి విదూరులుగ నున్న వారు మన విజ్ఞాన వికాసమును, సంస్కృతిని, తమ యాదర్శాచారములతో కొలిచిచూచి, వాని కందనివి, వారికి తెలియనివి, ' అహేతు కములు, అవాంఛనీయములు, అనాగరికములు ' అని యవివేకముతో నిర్ణయములను గావించు సాహసమునకు గడంగిరి. గిరిగీచుకొని, పరిధులలో జరిపిన పరిశ్రమ యది. అనంతమై, అవధుల నధిగమించిన విజ్ఞాన కాంతి ప్రసారబలముగల ఆర్యా వర్త విద్వ నైపుణ్యమునకు పాశ్చాత్యుల ప్రజ్ఞ ఎట్లు కొలబద్ద కాగలదు? అయినను–వారు గావించిన కృషి పూర్తిగ వ్యర్థము గాలేదు. అది మన కన్నులను విప్పి మన వైభవమును గుర్తించు నదవకాశమును జేకూర్చినది. ఇతర రంగములవలెనే దేవా లయముల నిర్మాణమును గూర్చియు, అందలి పవిత్ర భావములను గూర్చియు కళల నైపుణ్యమును గూర్చియు, పెక్కు దురభిప్రాయములను, అశాస్త్రీయములగు ఆవేశము లను దురహంకారపూరిత దుర్భావము లను పరులు ప్రకటించి, ప్రచారమునకు

దెచ్చుటలో మన మాశ్చర్యమును జెందవలసిన యగత్యములేదు. కాని, ఇప్పటికైనను భారతీయులు పరుల ననుకరించుటలో గల వికారమును గమనించి, తమ సహజ వివేకవైభవముతో ప్రాచీన విజ్ఞానసంపత్తిని విస్పష్టముగ గ్రహించి, దానిననుభవమునకు దెచ్చుకొని, తమ్మును, తమదేశమును, ఉన్నతికి దెత్తురని ఆశించుచున్నాము.

మన దేవాలయములలోని శిల్పకళానైపుణ్యమును – అందుగల యుద్దీపనతత్వమును—ఒక ప్రత్యేకలక్షణమును గలిగియున్నది. దీనికి మన తంత్ర గ్రంథములు ఆగమములు మూలాధారములు. నారాయణకవి రచించిన తంత్రసముచ్చయమునందు మనదేవాలయముల నిజస్వరూప స్వభావములు సరళముగ వ్యాఖ్యానమొనర్పబడెను. ఈ గ్రంథమునకు – 'మయమతము', 'కశ్యపశిల్పము,' 'విష్ణుసంహిత', 'శైవాగమ నిబంధనము', 'ఈశానశివగురు దేవపద్ధతి', భోజరాజవిరచిత 'సమరాంగణసూత్రధారము' కుమారకవిరచిత 'శిల్పరత్నము' 'ప్రయోగమంజరి' మున్నగు గ్రంథములాధారములు. కాని, పాశ్చాత్యులు 'మానసార' (మనుసారము) అను గ్రంథమునాధారముగ నిడుకొని, తమ పరిశోధనములను నిర్ణయములను గావించిరి. ఇంతేగాదు తమశిల్పవిధానములను ప్రమాణములుగ నిడుకొని, హైందవ శిల్పమున కపార్థములను ల్పించిరి. మనదేశమున రామరాజు, పి. కె. ఆచార్య మున్నగువారు పాశ్చాత్యుల ననుకరించుచు మన ప్రమాణ గ్రంథములలో స్వతంత్ర పరిశ్రమమునుగావింపక, భారతీయ శిల్పకళానైపుణ్యమును కించపరచు వ్రాతలనువ్రాసిరి. పైని పేర్కొన్న ప్రమాణ గ్రంథములందెచ్చటను మానసార గ్రంథనామము పేర్కొనబడలేదు. హైందవుల దేవాలయములు మానవుని చైతన్యము ద్వారా ఆధ్యాత్మికవికాసమును, దైవత్వమును ఆవిష్కరించును అని, జనులందరు ఒకచో గుమిగూడి కట్టుగ ప్రార్థనలుగావించు మందిరములుగావు. అవి–భగవద్భక్తుడగు ప్రతివ్యక్తి లోగల దివ్యత్వము నుద్దీపింపజేయు పవిత్రాలయములు. అంధకారబంధురమైన నరుని అంతరంగమున వేదాంత కాంతులను–దివ్యభావలహరులను వెల్లివిరియించు ప్రబలతమ సాధనములు.

మన ఆగమములు. తంత్రములు, వాస్తు శిల్ప, చిత్రలేఖనాదులను గూర్చి ఉన్నతస్థాయిలో ప్రవచించినవి. అనగా–మానవజీవిత పరమలక్ష్యమగు ఆధ్యాత్మిక

స్థాయిని నిర్దేశించెడు దివ్యాలయములుగ నివి వెలుగొందుచున్నవి. అందు—శారీరిక, మానసిక, ఆధ్యాత్మికముల సమీకరణమున, సందీపనత్వమును గాంతుము. పాశ్చాత్యులు వ్యక్తికి భౌతికత్వమునకు ప్రాధాన్యము నొసంగిరి. ఇక భారతీయులన్ననో—సమిష్టికి, ఆధ్యాత్మికమునకు ప్రాముఖ్యమునిచ్చిరి. మితిమీఱిన స్వేచ్ఛను వాంఛింపక నియమనిగ్రహములతో గూడిన స్వాతంత్ర్యమునకే పట్టముగట్టిరి. మితిమీఱినస్వేచ్ఛ శ్రుతి సౌభాగ్యమును గోల్పోయినగానమువంటిది. గతి దప్పిన శకటగమనమును బోలినట్టిది. అదిమనస్సునకు విశ్రాంతినొసంగక, అలసటను జేకూర్చి కలవరపాటును కలిగించును. 'వానితలదిరిగినది. గాడితప్పినాడు. హద్దులుమీఱినాడు' అను లోకోక్తులను వినుచుందుము. ప్రయాణమును సాగించువారికి పయనింప ననువగు మార్గములుండవలెను. అట్లే—స్వాతంత్ర్యమునకును కొన్ని నియమములు గలవు. శిల్పశాస్త్రమునకుగల నియమములు సైతము రాచబాటలవంటివే. ఇవి కంచెలవలె ఆదర్శమును కాచి, సంరక్షించుచుండును. ఇట్టి నియమములతో జీవించుచో — ''సత్యం, శివం, సుందరమ్''అను బ్రహ్మమును బడయగలము. చారిత్రికములు, హేతుబద్ధములునగు విమర్శనములను ఆదర్శము పూర్తిగ నిరాకరింపదు· అది ఉత్తమస్థాయినుండి వానికి గల యుచితస్థానమును వివరించుచుండును. భారతీయుల శిల్పశాస్త్రములు ఇట్టి యాదర్శము నందుకొను జీవిత ప్రమాణములో చక్కని మార్గములుగ సహాయపడుచున్నవి. ఇవి మన మానసిక తత్త్వమును, ఆంతరంగికాన్వేషణమును జూపెట్టు అద్దములవంటివి. బాహ్యప్రకృతినుండి లావణ్యమయమగు ఆంతరంగిక ప్రకృతివంకకు మనల నివి నడిపించును. నిరంతరము మనన మొనరింప యోగ్యములగు దివ్యభావములనే హైందవ శిల్ప శాస్త్రములు ప్రబోధించుచున్నవి. "యద్భావం తద్భవతి'' ప్రతిభావనము తదనుగుణఫలరూపమును దాల్చుచుండును. దివ్యభావము దివ్యరూపము దాల్చును. తద్భిన్నము వికృతరూపమును గలిగించును. సృష్టికి భగవంతుడు కారణమైనట్లు సృజన శక్తిగల శిల్పమునకును దివ్యత్వమేమూలము. ఆ దివ్యశక్తియే సర్వవిశ్వమును చైతన్యవంతమొనర్చి, దాని ధర్మములను నెరవేర్ప జేయుచుండును. ఈ విశ్వమున ప్రకటితములగు సర్వరూపముల కన్న నుత్తమముగ మానవరూపము పరిపూర్ణ

నిర్మాణమును గాంచినది. అది చైతన్యవంతమై యలరారినది. అందువలన శరీరమునగల ప్రత్యవయవమును తదితరావయవములతో సఖ్యసంబంధములు గలిగి యుండి, సౌష్ఠవమైన—సౌందర్యవంతమైన రూపును దాల్చును. ప్రత్యవయవమునకు ప్రత్యేకమగు బాధ్యత యున్నను, తత్కృషి సర్వశరీరముపైనను ప్రసరించుచుండును. చేయి సరిగ పనిచేయకపోయిన, అది చేతికే కాక సర్వశరీరమునకు బాధను, వైకల్యమును కలిగించును. అట్లే – తదితరావయవములును. ప్రత్యవయవమును సక్రమముగ తన ధర్మమును నిర్వహించుచున్నచో – శరీరమునకు శోభను, తేజస్సును చేకూర్చుటయే గాక, మనస్సునుండి ఉన్నత భావముల నుదయింపజేయును. ఈ కారణము వలననే మన పూర్వులు తపస్సును గావించిరి. యోగారూఢులుగ వెలుగొందిరి. ఆత్మానుభూతి నందుకొని సౌందర్యమును, ఆనందమును ఆవిష్కరింపజేసికొనిరి. మన శిల్పులు యోగులై, సమాధి గ్రస్తులై, సౌష్టవవంతమైన సౌందర్యరేఖా పరిపూర్ణమైన శిల్ప నిర్మాణమును గావించిరి. వారు మానవదేహమును భగవంతుని ఆలయముగ భావించి కీర్తించిరి.

"దేహోదేవాలయః ప్రోక్తో! జీవోదేవ స్సనాతనః!
త్యజే దజ్ఞాన నిర్మాల్యమ్! సోఽహం భావేనపూజయేత్ ॥"

— స్కందోపనిషత్తు.

ఈశ్లోకభావ మెల్లరకు సువిదితము, హైందవులు విగ్రహమును రాయిగనో లోహముగనో యారాధింపరు. అందు భగవంతుని దివ్యమంగళస్వరూపమును చిత్రించుకొని, తల్లీనులై, భగవంతుని ప్రత్యక్షముగ గాంతురు. బాహ్యప్రకృతిని అంతఃకరణ ప్రకృతితో సమన్వయించి, తదతీతులుగ వారు వెలుగొందుచుందురు. అంత పిండాండములను బ్రహ్మాండముతో సమీకరించి, భగవంతుని ప్రత్యక్షముగ గాంచుచుందురు. మానవ రూపమును భక్తిభావముతో పుటముబెట్టి, పవిత్రీకరించి దేవత్వమును జేకూర్తురు. కావున పరమాత్మను ప్రత్యక్ష్య మొనర్చు కొనుటకు మానవదేహము పరమసాధనము దేవాలయము భగవంతుని భవనము. అనగ–వాని దివ్యదేహమే

ఆలయము విశ్వవ్యాప్తుడగు భగవంతుడు అందును లీనమైయుండుట తథ్యమే గదా! మన శరీరమునందుండియు దాని కతీతముగ జీవాత్మ వెలుగొందుచున్నట్లే భగవంతుడును విగ్రహమునందుండియు దాని కతీతముగ ప్రకాశించుచుండును. వ్యక్తియొక్క మానసికతత్వమున కనుగుణముగ తద్వికాసానుగుణముగ ఈభావము వెలుగొందుచుండును. హృద్గత భావముల కనుగుణముగ మానవుడు భగవంతుని యారాధింపబూనును. ప్ర తి మ ల యాకృతులలో–ప్రార్థనల ధోరణులలో విభిన్నత నున్ననేమి? అంతయు పరమేశ్వరసేవకు ప్రతిబింబమేయగును.

ఈ యంశమును బలపరచు మానవుని భగ దారాధనానురక్తిని బ్రశంసించుచు –అందలి యుత్కృష్టతను హృదయపూర్వకముగ నగ్గించిన జాతిపిత పూజ్య బాపూజీ భావము లిట గమనార్హ ములు.

"మానవుని దేవాలయారాధన అతనిలో అంతర్గర్భితమైయున్న ఆధ్యాత్మికాన్వేషణకు ప్రబలచిహ్నము. తనలోగల ఆధ్యాత్మిక తృష్ణను సంతుష్టికొరకే దేవాలయములలో నరుడు ఆరాధనా నిమగ్నుడగుచున్నాడు. దైవారాధనము సంస్కరణ విరుద్ధముగాదు. ఇలలోమానవత నిలచియున్నంతకాలము–దేవాలయములు అర్చనలు ఉండితీరును. మన మాతృభూమిని పావనము గావించెడి వేలాదిపవిత్ర దేవాలయములను ప్రాణములనర్పించియైనను సంరక్షణ చేయగలశక్తిని భగవానుడు నాకు ప్రసాదించుగాక!"

— మహాత్మాగాంధీజీ.

"పురాతన దేవాలయముల చుట్టును–శతాబ్దముల తరబడి మానవులమనోభివేశములు గంభీరముగను శాశ్వతముగను నెలకొనియున్నవి. ఇట్టి దేవాలయ పునరుద్ధరణము దేశముయొక్కయు, హైందవ సంఘము యొక్కయు, సాంస్కృతిక పునరుజ్జీవనమునకేగాక భావైక్యమునకు గూడతోడ్పడ గలదు."

— డా॥ సంపూర్ణానంద్.

ఈపెద్ద లిరువురు ప్రవచించిన వాక్యములు మానవ జీవితముపై దేవాలయములెట్టి ప్రభావము లెట్టి తీరున బ్రసరింపజేయుచున్నవో సుస్పష్టముగ వ్యక్తీకరించు

చున్నవి. మానసికతత్వానుగుణముగనే మానవుడీ దేవాలయములలో ఆరాధనము గావించుకొనవచ్చును. అందులకే హిందువు లిష్టదేవతారాధనమును నిర్ణయించిరి. ప్రతి వ్యక్తికిని ఇష్టదేవతారాధనమునందే దివ్యానుభూతికిపలయు బీజములుగలవు. ఇష్టదేవతారాధనము వ్యక్తుల మనోవికాసమునకు దోహదమొనంగు సాధనములు. దేవాలయములందు పూజింపబడెడి ఆఇష్టదేవతామూర్తి అనంత బ్రహ్మమునకు ప్రతి నిధి. మనదేవాలయము లందలి విగ్రహములు, మానవ శరీర నిర్మాణము నాధార ముగ గైకొని చిత్రింపబడెనని వెనుక నుడివియుంటిమి. ఇందు మన ప్రత్యేకవిశిష్టత యుకలదు. తదేకనిష్టతో ఇష్ట దేవతారాధనము గావించిన పిదపనే శిల్పి తన్మూర్తి చిత్రణమునకు బూనుకొనును. ఇట్టియారాధనమును మనశిల్పశాస్త్రములు గర్భవిన్యా సము లేక గర్భాదానము అని నుడువు చున్నవి. అనగా–జీవి గర్భమునందున్న స్థితిని బాగుగా వెలుకకు దెచ్చుకున్న పిమ్మటనే, శిల్పి విగ్రహ నిర్మాణమునకు గడంగును.

"ప్రసాదం పురుషం మత్వాపూజయేన్మం త్రవిత్తమః"

— శిల్పరత్నము.

మానవుని భిన్నాంగములను విస్పష్టముగ చిత్రింపబడుటను విగ్రహనిర్మా ణమున గాంతుము. మన శిల్పులు శరీరమునకును జీవాత్మకు గల సంబంధమునే మనదేవాలయ నిర్మాణమును–అందలి విగ్రహమునందును జూపెట్టిరి. భిన్నత్వమున నేకత్వమును సాధించుటను ప్రబోధించెడి వేదమంత్రమే మన శిల్పశాస్త్రమునకును జీవగఱ్ఱ. పవిత్ర సంకల్పముతో శిల్పి విగ్రహమును నిర్మించును. ఆవల నిజయోగ శక్తి ఫలితమైన ఆధ్యాత్మికశక్తని ఆ మూర్తియందు పూరించి, దివ్యముగ బ్రకాశింప జేయును. కనుక, మన దేవాలయమునందుగల వాస్తుశిల్ప చిత్రలేఖనాది సర్వనిర్మా ణములను – మానవుని హస్తనైపుణ్యమును – మానసిక వికాసమును భావౌన్నత్యమును బ్రకటించును.

శిల్పి, స్థితి ప్రజ్ఞుడుగ–మహాయోగిగ–జీవిత నిర్వహణమును గావింపవలెను. సంస్కృత భాషనభ్యసించవలెను. ఆ వాఙ్మయమున జూపట్టెడి వాస్తుశిల్పాది లలిత

కళలలో ప్రావీణ్యమును బడయవలయును. విధిగా వేదాధ్యయనమును గావింపవల యును. ఆగమ శాస్త్రమును పఠింపవలయును.

అతి ప్రాచీనకాలము నుండియు మన గ్రామములందు భిన్న వృత్తులవారు జీవించుచుండిరి. వీరు గ్రామ సౌష్ఠవమును, సౌభాగ్యమును సంపూర్ణముగ బెంపొంద జేసిరి. వీరిలో నేడు మనము పేర్కొను కమసాలులును గలరు. తమిళ భాషయందు వీరిని 'కమ్మలారులు' అందురు. వీరు ఆర్య సంతతికి జెందినవారు. ప ం జా బు ప్రాంతమునుండి వలస వచ్చిన వారని ప్రతీతి. వీరిని 'దేవబ్రాహ్మణులు' – 'విశ్వ బ్రాహ్మణులు' అని యందురు. భారతదేశమున సర్వ ప్రాంతములయందును వీరు నివసించుచున్నారు. వీరి సంతతికి జెందిన పలువురు బర్మా, సయాం, జావా,సుమ త్రా, బోర్నియా, సిలోను మున్నగు ప్రాంతములకు వలన బోయిరి. అట తమశిల్ప కళా నైపుణ్యమును బ్రదర్శించు, మన సంస్కృతికి ప్రతి బింబములగు వివిధ దేవా లయములను – చిత్రకళామందిరములను నిర్మించి, వారిప్రశంసలకు పాత్రులైరి. వీరిలో కొందరు పురోహితులుగా గూడ నుండిరి. వీరు విశ్వకర్మ సంతతికి జెందినవారు. విశ్వకర్మ కైదుగురు పుత్రులు. అందు జ్యేష్ఠుడయిన మనువు సంతతివారు ఇనుము ఉక్కు మున్నగువానితో పనిముట్లు తయారు చేయుచుందురు. ద్వితీయుడగు మయుని సంతతివారు కొయ్యతో చిత్ర విచిత్రములు కళావంతములు నగు వస్తువులు నిర్మించు చుందురు. తృతీయుడగు త్వష్ట సంతతివారు కంచు, ఇత్తడి, రాగి మున్నగు లోహములతో విగ్రహములను, పాత్రలను చేయుచుందురు. చతుర్థుడగు శిల్పిసంత తికి చెందినవారు.ఱాలుచెక్కి విగ్రహములను, దేవమందిరములను నిర్మించుచుందురు చివరివాడగు విశ్వజ్ఞానిసంతతివారు వెండి, బంగారములతో ఆభరణములను, పాత్ర లను తయారు చేయుచుందురు. వీరంద రొకే యొక వంశమునకు జెందినవారైనను, తమ తమ యిష్టానుసారముగ పైనిపేర్కొన్న వృత్తులలో నొకదానినో – కొన్నింటినో అవలంభించి అందు ప్రవీణులై వర్ధిల్లుచుండిరి. అనిత రసాధ్యమగు యోగనిరూఢితో దివ్యతేజమును నిక్షిప్తము గావింపగల ప్రజ్ఞావంతమైన శక్తిని ప్రదర్శించి, అతిలోక సుందర స్వరూప నిర్మాణదక్షతతో ఆధ్యాత్మిక భావ వైభవ విస్తారవ్యాప్తికి అనువగు మూర్తికల్పన గావించి చరితార్థులు కాగలిగిరి.

దేవాలయ నిర్మాణ విగ్రహ చిత్రణాదుల యందు జీవితాశయమును సంలగ్నము గావించుయోగియే శిల్పి.

శిల్పులను నాలుగు వర్గములుగ విభజింపబడిరి. ప్రథముడు :—స్థపతి నిర్మాణనేత. సూత్రగ్రహకుడు – వాస్తువునందు ప్రవీణుడు. ఇతడు ద్వితీయుడు. తృతీయుడు వర్ధకి. నాల్గవవాడు తక్షకుడు – అనగా వడ్రంగి. వీరికి స్థపతి ఆచార్యుడు. వీరందరును కులీనులుగా నుండవలెను.

ఆచార్యో వినయో విద్యా ప్రతిష్టా తీర్థదర్శనమ్।
నిష్ఠావృత్తిస్తపో దానం నవధా కుల లక్షణమ్ ॥

—శబ్దకల్పద్రుమము

వీరందరును తపస్సును గావింపవలెను. వేదము నభ్యసింపవలెను. యోగము ననుష్ఠిందువలెను. జ్ఞాన సంపన్నులుగ వెలుగొందవలెను.

"తపస్త్వా సర్వమే అస్రజత య దిదం కించ"

— వేదము

భగవంతుడు తపస్సంపన్నుడుగ సృష్టిగావించెను. కావున, కళాకారుడగు శిల్పియు తపస్సంపన్నుడుగ నుండి శిల్ప కళాసృష్టిని గావింపవలెను. సృజనశక్తిలేనిదే కళ వికాసము గలిగి యుండజాలదు.

"దేవస్తు ద్వివిధో జ్ఞేయః స్థావరో జంగమస్తథా."

కాబట్టి, ఆచార్యుడగు శిల్పి దీక్షను బూని, దేవాలయమును—అందు స్థాపించు విగ్రహమును నిర్మింప వలెను. దేవాలయ నిర్మాణమునకు పూర్వము సముచిత స్థలనిర్ణయము గావించు టవసరము. అట్టితరి, పరిపక్వానుభవ పరిపూర్ణులగు శిల్పివరేణ్యులు మట్టిని పరీక్షింతురు. పరిసరములను బరిశీలింతురు. ప్రకృతి సౌందర్యము నన్వేషింతురు. గాలిని, నీటిని గూర్చి నిశితముగ పరిశీలింతురు. అంతట స్థలనిర్ణయమును గావింతురు.

ఇట్లు నిర్ణయింపబడిన స్థలము తరచు శైలములు వనములు నదులుగల ప్రాంతముగ నుండవలెను. ఆస్థలము మనస్సును రంజింపజేయునదిగను నుండవలెను.

అప్పుడే దేవాలయ నిర్మాణమునకు గడంగుదురు. ఆదేవాలయములో స్థాపించు విగ్రహమును శిల్పి సుందరముగ, ఆకర్షణీయముగ నిర్మింపవలెను.

ఆ విగ్రహస్థాపనకాలమున తపస్వియు యోగియు నగు స్థపతి ఆ విగ్రహము నందు దివ్యశక్తిని ప్రసరింప జేయును. భగవంతుడు సర్వవ్యాపకుడు కనుక, అట్టి భగవంతుని ఆవిర్భవింపజేయు–సాక్షాత్కరింప జేయు విధముగ విగ్రహమునందు జీవకళను శిల్పి ప్రతిష్ఠింపవలెను. ఇది ఈశ్వరశక్తిని అభివ్యక్తికి దెచ్చుట–ప్రకాశింప జేయుటయే కాగలదు. ఈ దివ్యశక్తి క్షీణింప కుండుటకు దానిని నిత్యము ప్రకాశింప జేయుటకు పూజారు లవసరము. ప్రమిదలో తైలమునుంచి–వత్తిని పైకిద్రోయుచు–ఆ దీపము కాంతిహీనము గాకుండ జేయుపగిది, పూజారులు ఆధ్యాత్మిక జీవిత సంపన్నులుగ వెలుగొంద వలెను.

"సురూపాం ప్రతిమాం విష్ణోః
ప్రసన్నవదనే క్షణామ్ ।
కృత్వాऽऽత్మనః ప్రీతికరీం
సువర్ణరజితాదిభిః
తామర్చయేత్ తాం ప్రణమేత్
తాం జపేత్ తాం విచింతయేత్ ॥"

"అనుగ్రహకరములైన చూపులు గలిగినట్టియు అందమైనరూపము గలిగి నట్టిదియు–ఆత్మకు మోదమును జేకూర్చునదియు నగు శ్రీ మహావిష్ణువుయొక్క మూర్తిని వెండితోగాని, బంగారముతో గాని చిత్రించి, ఆ ప్రతిమ నర్చింపవలెను. దానికి నమస్కరింపవలెను. దానిని గూర్చి ధ్యానింపవలెను. దానినే మనస్సునందు సర్వదా మననము గావింపవలె" నని వ్యాసభగవానుని సూచనము.

వేదములు అగ్న్యారాధనమును గీర్తించుచున్నవి. అట విగ్రహారాధనము గన్పింపదు.

బ్రాహ్మణములకాలమున యజ్ఞవేదికలకడ ఇంద్రాది దేవతల నారాధించి వారిని ప్రత్యక్ష మొనర్చుకొను చుండెడి దివ్యశక్తి సంపన్నులుగ యజ్ఞకర్తలు వెలు గొందుచుండెడివారు. కాలక్రమముగ ఈశక్తి క్షీణింపసాగెను. పిదప కొందఱు ఋషులు సామాన్యమానవులలో భక్తి శ్రద్ధలను ప్రబలించుటకును–ఆధ్యాత్మిక వికాసము నందించుటకును-విగ్రహారాధనమును నెలకొల్పిరి. దీనినే 'మూర్తిపూజ' (ప్రతిమా రాధనము) అందురు. దేవాలయములలో మొట్టమొదట అర్చకులు లేరు. భక్తులు–ఎవరికివారు పూజలను గావించుకొనుచుండెడివారు. ఆవల కొంతకాలమునకు అర్చకు లేర్పడిరి.

విగ్రహారాధనము–సాధనదశయందుగల భక్తులకు భగవంతునిపై భక్తి శ్రద్ధలను గలిగించి–వానిని ప్రత్యక్షముగ గాంచుటకు దోహదము నొసంగును. నిశ్చల చిత్తమును–పవిత్ర హృదయమును ప్రసాదించి, దివ్యునిగ గావించుటకు మిక్కిలిగ దోడ్పడును.

ఆధ్యాత్మిక దివ్య విద్యా పట్టభద్రత నందగోరిన వారి కిది – అక్షరాభ్యాస సదృశమాత్రమే కాదు–అఖండ విజ్ఞాన చైతన్య ప్రధానకారకమై, భగవ దనుభూతిని పొందుటకు గూడ పరిపూర్ణముగ దోడ్పడును. స్వామిని తనవానిని గావించుకొనగల భక్తి ప్రపత్తి, సంభరితమైన ఆత్మబలమును సైతము ప్రసాదించును.

## దక్షిణభారత దేవాలయములు

బాహ్యదృష్టికి పెక్కు ప్రాంతములలోగల దేవాలయము లొకేవిధముగ గన్పించుచున్నను, వాని నిర్మాణములో–వాస్తుశిల్పాది విశేషములలో పెక్కు భేద ములను మనము గాంచగలము. దేవాలయములు అతిపవిత్రములు. అవి దివ్యత్వ మునకు నిలయములు. కాబట్టి, అతి ప్రాచీన కాలమునుండియు దేవాలయములను

పరిశుభ్రముగ-దివ్య శక్తికి నిలయములుగ నుంచు సదాచారములను నిత్యానుష్ఠాన ములుగ మన పూర్వులు నెలకొల్పిరి. అవి-భక్తికిని, ఆధ్యాత్మిక విజ్ఞానమునకును, సంస్కృతికిని, ఆలవాలములై యలరారుచుండును. దేవాలయములు యాత్రిక కోటి నాకర్షించుచుండును. ఆధ్యాత్మిక కేంద్రములుగా-పుణ్యక్షేత్రములుగా-దివ్యతీర్థ ములుగా భక్తుల కుపకరించుచుండును.

మనదేశములో క్రీస్తునకు పూర్వమే దేవాలయములుండెనని చరిత్రకారుల నిర్ణయము. అట్టి పురాతన దేవాలయములు గంగాతీరము నందెన్నియో కలవు. భూపాలమునగల 'బెజ్నగర్' లో ఇటుకలతో గట్టిన విష్ణ్వాలయ మొకటి కలదు. భగవంతుడు సర్వాంతర్యామి యని హిందువుల ప్రగాఢ విశ్వాసము. అందు వలన ఆ పురుషోత్తముని ప్రత్యక్షము గావించుకొనుటకు భిన్నమూర్తుల జిత్రించి-ఆరాధించిరి. భక్తుని నిశ్చల చిత్తునిగ-ధ్యాన నిష్ఠాపరునిగ గావించుటకే విగ్రహా రాధనము లక్షింపబడినది. విగ్రహమును భగవంతుడని సంభావించి, చిత్తశుద్ధితో భక్తులా మూర్తినారాధింతురు, అందు-అర్చనములకు, ఆరాధనములకు-సూక్ష్మములగు పెక్కునియమములును, సున్నితములగు సదాచారములును గలవు.

వాస్తుశాస్త్రము-శిల్పము-ఆగమములు మున్నగునవి సదాచార సంపత్తితో దేవాలయములందు దివ్యత్వము నుద్దీపింప జేయుచుండును. గర్భగుడి దేవాలయ మునకు హృదయము వంటిది. ఇందు విగ్రహమును మంత్ర శక్తితో ప్రతిష్ఠింతురు. దేవాలయము లలితకళలకు-కుటీర పరిశ్రమలకు నిలయము.

ఇట్టి దేవాలయములు దేశమునకు భౌతిక సంపదలనిచ్చి, ప్రజలను సుఖ జీవనుల జేయును, శాంతిప్రియుల గావించును, దివ్యత్వమును ప్రసాదించును. భౌతి కాధ్యాత్మికములను సమన్వయించి, మానవుని మానవత్వము నుండి దేవత్వము వంకకు పురోగమింపజేయును.

దక్షిణభారతమున నిర్మితములైన దేవాలయములు సర్వలక్షణ సంపన్న ములుగ సంశోభిల్లుచున్నవి. అవి సత్సంప్రదాయములకు-భక్తిపూరిత పవిత్రమైన

జీవిత నిర్వహణమునకు పరమ పదములుగ తేజరిల్లుచున్నవి. ఇట ప్రతిదేవాలయ మునకు ఒక ప్రత్యేక లక్షణము గలదు. ఇచ్చట స్థలమాహాత్మ్యము–ప్రకృతి సౌందర్యసంపద–భక్తుల నాకర్షించు చుండును. తఱచుగ దేవాలయములు నదీతీర ములందును–సాగరసంగమ ప్రాంతములందును-శైలాగ్రసీమల యందును–సముద్ర సమీపములయందును నెలకొల్పబడినవి. కొంత కాలమునకు ప్రతి గ్రామము నందును దేవాలయములు నిర్మింపబడి, ప్రాంతీయ ప్రజలకు అందుబాటులో నుండసాగెను. ఉదాహరణముగ విష్ణ్వాలయములనే గాంచుడు. ఒక్కొక్క దేవాలయమును ఒక్కొక్క ప్రత్యేక దృక్పథముతో నిర్మించి, తదనుగుణముగ–అందు మూర్తిని ప్రతిష్ఠించినట్లు మనకు గోచరించును.

## యోగవిష్ణువు

ఈదేవాలయములు గ్రామములకు సుదూరముగ-సాంద్రారణ్యములలో— ఏకాంతవాస యోగ్యములుగ నిర్మింపబడినవి. ఇవి భక్తులకు ప్రశాంత వాతావరణము నందించును. యోగము ననుష్ఠించుట కనువుగనుండును. ఇందలి భక్తుడు మూర్తి నాధారముగ నిడికొని, ధ్యానమును–ధారణమును జేకూర్చుకొనును.

## భోగమూర్తి

ఈ దేవాలయములు తఱచుగ గ్రామముల మధ్య నిర్మింపబడును. ఇందు పురుషోత్తముని అవతారమూర్తుల గాంతుము. భక్తులు తమ యిష్టకామ్యార్థముల బడయుటకై ఈ మూర్తుల నారాధింతురు. తమ గ్రామములు పాడి పంటలతో సిరిసంప దలతో తులదూగవలెనని సంభావించి ఈయర్చామూర్తులనారాధించుచుందురు. ఇట్టి దేవాలయములందలి విగ్రహములే భోగమూర్తులుగా సుప్రసిద్ధములు.

## వీరమూర్తి

కొన్ని దేవాలయములలో శత్రుసంహరణమును భక్త సంరక్షణమును సూచించు మూర్తులు ప్రతిష్ఠింపబడి యుండెను. ఇవి ఉగ్రరూపములతో భీతిగొల్పుచుండును.

అందువలన, ఇట్టి యాలయములు గ్రామములకు, పట్టణములకు దూరముగా నిర్మితము లగుచుండును. ఇందలి మూర్తులే వీరమూర్తులు.

## క్షుద్రదేవతలు

వీనిని అభిచారికలని యందురు. ఇవి విఘ్నములను సూచించును. తన్నివార ణార్థము భక్తులు వీని నారాధించు చుందురు.

ఈ విధముగ ఆయా దేవాలయముల కనుగుణముగ స్థలనిర్ణయము జరుగు చుండును. స్థలనిర్ణయములో మట్టి-రంగు-రుచి-వాసన-మున్నగునవి ప్రధానముగ పరిశీలింపబడును. నిర్ణీత ప్రదేశములలో శిల్పులు సుందరముగ-కళాశోభితముగా-ఆయా దేవాలయముల నిర్మాణమును గావింతురు.

దుర్గంధము వెడలు ప్రాంతములు-ప్రకృతి రమణీయతను, మహిమను ప్రస రింపజాలని ప్రదేశములు దేవాలయ నిర్మాణమునకు యోగ్యములు గానేరవు.

చారిత్రికముగ మనకు దెలిసినంతవరకు దక్షిణ ప్రాంతమును పాలించిన మొదటి ప్రభువులు పల్లవులు. వీరు భగవద్భక్తిసంపన్నులు. లలితకళల యందాసక్తి గలవారు. ఈకారణమున వీరు శిల్పశాస్త్రజ్ఞులను ప్రోత్సహించి, కళాశోభితములగు దేవాలయముల పెక్కింటిని నిర్మింపజేసిరి.

ఈ పల్లవ ప్రభువులకు ముఖ్యపట్టణము కాంచీపురము. కాంచీపురము అతి పురాతన కాలమునుండియు పల్లవరాజులకు ముఖ్యపట్టణముగ నుండుటయేగాక, పవిత్ర క్షేత్రముగ గూడ ప్రదీపించుచున్నది.

కంచి-భారతసంస్కృతికి సంపన్న నిలయము. ఆత్మానుభూతికి తోడ్పడు పుణ్యక్షేత్రము. పల్లవులలో మొదటిరాజు మహేంద్రవర్మ. సముద్రతీరమునగల మహాబలిపురమునందును, తిరుచునాపల్లికి సమీపమునగల సిత్తన్నవాసలు ప్రాంతము నను పెద్దఱాళ్ళతో పెక్కు శిల్పములనునిర్మింపజేసెను. అందు స్తంభములు-మంట పములు-భిన్న భిన్న దేవతలు చిత్రవిచిత్రమగు ఇతర శిల్పములు గలవు.

ఈ దేవాలయములు చైతన్యవంతములుగ దివ్య శక్తికాసారములుగ వెలుగొందు చున్నవి. పల్లవరాజుల రాజ్య చిహ్నములగు సింహములను స్తంభములపై శిల్పులు చిత్రించిరి. తదనంతరము కొంతకాలమునకు నరసింహవర్మ ఆ ప్రాంతమునకు పాలకుడయ్యెను.

ఈయనకాలమున శిల్పకళ ప్రఖ్యాతిగాంచి మహోన్నత స్థాయింగని, సర్వప్రాంత ములకు వ్యాపించెను. అందునను మామిళ్ళపురము (మహామల్లపురము) విశిష్టమైన కీర్తిని గడించినది. ఇది సముద్రతీరమున నోడరేవుగా విలసిల్లెను. ఇట పెక్కు రాజ భవనములు—సుందర ప్రాసాదములును నిర్మింపబడినవి. ఈపట్టణమునకు పాలారు నదినుండి కాలువలద్వారా మంచినీటివసతులను ధారాళముగ గావించిరి. ఇచ్చట నల్లని కంకర ఱాళ్ళతో రథములు మున్నగునవి కళాపూర్ణములుగ జెక్కబడినవి.

అందునను—అర్జునుడు తపస్సుగాంచిన గాథను జిత్రించిన శిల్పుల కళా మహిమ వర్ణనాతీతము. హిమాలయముల నుండి జనపద ప్రాంతములకు గంగను ప్రవహింపజేయుటకై తపస్సును గావించిన గాథ నొకేశిలపై రమణీయముగ నిట శిల్పులు చిత్రించిరి. ఇది వీరిశిల్పకళా ప్రౌఢిమ నెంతయు బ్రదర్శించుచున్నది. ఆ పిదప రాజసింహుడు రాజయ్యెను. ఈయన పాలనములో శిల్పకళా విధానములో కొన్నిమార్పులు జరిగెను. కళలలో శిల్పులకు సంపూర్ణస్వాతంత్ర్య మీయబడెను. ఆ శిల్పుల మనోవికాసాను సారముగ శిల్పములను నిర్మించి నదవకాశము కల్పింప బడెను.

మామిళ్ళపురములో సముద్రతీరమునగల దేవాలయములు, కంచిలో కైలాస నాథ—వైకుంఠ పెరుమాళ్ళదేవాలయములు వీరి పరిపాలనాకాలమున నిర్మింపబడినట్టివే ఈ దేవాలయములు నేటికినీ చెక్కుచెదరక నిల్చియుండుటయే ఆనాటి శిల్పుల మహ త్తరశిల్పకళాప్రతిభకు ప్రబల నిదర్శనము. ఇంతే కాదు—పల్లవరాజుల కాలమున శిల్పులు, ఇండోనేషియా—కాంబోడియా మున్నగు దూరదేశముల కేగి, అచ్చట పెక్కు దేవాలయములను కళామయములుగా నిర్మించిరి. వీరికి పిదప చోళరాజులు

రాజ్యపాలనము గావించిరి. వీరిరాజ్యము గంగాతీరప్రాంతము వరకు వ్యాపించెను. బర్మా సిలోన్ ప్రాంతముల పర్యంతము వీరి యధికారముద్రలు చెల్లినవి. రాజరాజ చోళుడు చోళరాజ్యమునకు ప్రథమ ప్రభువు. ఈయన ఆధ్యాత్మికచింతనాతత్పరుడు. విశ్వవిఖ్యాతమైన తంజాపురి బృహదీశ్వరాలయ నిర్మాణ మహాభాగ్యము ఈ ప్రభువునకే దక్కినది. ఈ దేవాలయ నిర్మాణమున శిల్పుల ప్రజ్ఞానంపద—హస్తనైపుణ్య విశేషము ఆధ్యాత్మికవికాసము విస్తారముగ గాంచగలము.

ఇచ్చట— భారతదేశమునం దన్ని ప్రాంతముల తులలేని ఖ్యాతిగడించిన శిల్పకళాపారంగతులెందరో కలరు. వీరు—కళావైదగ్ధ్యముతో సామాన్య ప్రజలనుండియు, సమర్థశిల్పమండలినుండియుబహుభంగుల ప్రశంసలనందజాలిరి. బృహదీశ్వరాలయ గర్భాలయముపై నిర్మింపబడిన విమానము, కళాకౌశలమును, దివ్య శిల్పప్రాభవ మును, శాస్త్రనైపుణ్యమును వేనోళ్ళ జాటుచున్నవి. రాజేంద్రచోళుడు కుంభ కోణమునకు సమీపమున గల గంగైకొండ చోళాపురమున నొక దేవాలయమును నిర్మించెను. ఇది నేడు శిథిలావస్థలో నుండుట విషాదకరము. అయినను నేటికినీ ఈ దేవాలయము సర్వ కళానిలయమై ప్రేక్షకులను ముగ్ధుల గావించుచున్నది. చిదం బరము, తిరువారూరు, తిరుభువనము మున్నగు ప్రాంతములలో చోళరాజనిర్మితము లైన దేవాలయము లనేకములు ప్రశస్తినందినవి.

చోళుల యనంతరము పాండ్యులు ప్రభువులైరి. వీరి కాలమున దేవాలయ ముల వాస్తువు—శిల్పము-శాస్త్రనియమముల కనుగుణముగ వ్యాప్తిని బడసినవి. ప్రాకా రము లత్యున్నతములై యలరారినవి.

వేదకాలమున గోపుర మనగా—గ్రామమున గల గో ద్వా ర మే. ఇది— దేవాలయమున బ్రవేశించు ప్రథమద్వారముగ—విమానముగ మారెను. పాండ్యుల కాలమున గాలిగోపురములు విపుల వ్యాప్తిని బడసి కీర్తిని గడించెను. జంబుకేశ్వరాల యమున కెదురుగా — ' సుందరపాండ్య గోపురము ' నిర్మింపబడెను. అట్లే - చిదం బరము, మధురలలో గల దేవాలయములయందు అభివృద్ధిని వికాసమును జూపెట్టు

పెక్కు శిల్పములను నిర్మింపజేసిరి. మన దురదృష్టమో యన - అచిర కాలములోనే పాండ్యరాజ్యమస్తమించెను. దక్షిణప్రాంతము గూడ మహమ్మదీయుల క్రూరదాడులకు గుఱియయ్యెను. ఇట - హిందూమతము అస్తమించునా యను భయావహదుస్థితి ఏర్పడెను. కాని, మన యదృష్టమోయన హిందూమతమును సముద్ధరించి, దాని పూర్వవైభవమును, ప్రతిభను దేదీప్యమానముగ వెలుగొందజేయు విజయనగర ప్రభువులు రాజ్యమును చేపట్టిరి. వీరు తుంగభద్రానదీతీరమున, తమ రాజ్యమునకు ముఖ్యపట్టణ మగు హంపీ పట్టణమును నిర్మించుకొని, కృష్ణాతీరము నుండి కన్యాకుమారి వరకు తమ రాజ్యమును వ్యాపింపజేసిరి. ఈ ప్రభువులు భాషలను, సాహిత్యమును చక్కగా నాదరించిరి లలితకళలను పోషించిరి. హిందూమతమును హృదయపూర్వకముగ సమాదరించి యభివృద్ధికి దెచ్చిరి.

విజయనగరము సర్వభౌతిక సంపదలతో నిండి, సంస్కృతికి నిలయముగ ఆధ్యాత్మిక వికాసమున కాలవాలముగ, ఆదర్శ ప్రజారాజ్యముగ విశ్వవిఖ్యాతిని గాంచెను. ఎందరో పరదేశీయుల మన్ననలకు పాత్రమయ్యెను. విజయనగర ప్రభువులు పురాతన దేవాలయములను పునరుద్ధరించిరి. వీనిని సర్వకళాశోభితములుగ ఆకర్షణీయములుగా పునరుద్ధరించిరి. పవిత్రములుగ గావించిరి: దేవాలయములకు కళ్యాణ మంటపములను నిర్మింపజేసిరి, అందు ఉత్సవములను గావింపజేసిరి. దేవాలయములకొక నూతనశోభను సమకూర్చిరి. హంపీక్షేత్రములోని దేవాలయములు, భవనములు వీరి కళాకౌశలమును జూపెట్టుచున్నవి. వీరి పాలనమున తిరుపతి-కుంభకోణము-కాంచీపురము-శ్రీరంగము-చిదంబరము మున్నగు ప్రాంతములందలి దేవాలయములలో లలితకళా విధానమునే గాంతుము. శ్రీరంగనాథుని ఆలయమున అశ్వస్తంభములు గల మంటప మొకటి గలదు. దీనిని 'రాయలమంటపము' అని పిలుతురు. ఇది వేయికాళ్ళమంటపమున కభిముఖముగా నున్నది. దీనిని శ్రీకృష్ణదేవరాయ ప్రభువులు నిర్మింపజేసిరి. అందుగల యశ్వములు, సైనికుల మూర్తులు వీరత్వమును ఉట్టిపడజేయుచున్నవాయని యనిపించును. వీరు - కళలందు వీరులను చిత్రింపజేసిరి. పౌరుష సాహసములం దతిప్రఖ్యాతుల బడసిరి. దురదృష్టవశమున మహమ్మదీయుల క్రూర

దాడులకు వశమై, విజయనగరసామ్రాజ్య మస్తమించెను. మహమ్మదీయులు తిరిగి తల యెత్తి, తమ దుష్టచర్యలను అమానుషముగ కొనసాగించిరి. కాని విజయనగర ప్రభువుల సేవలోనున్న కొందరు సేనాపతులు మహమ్మదీయులనోడించి, కొన్ని ప్రాంతములను తమక్రిందికి దెచ్చుకొని వానికి పాలకు లయిరి. వీరినే – 'నాయకులు' అందురు· వీరిలో తిరుమలనాయకుడు గొప్ప ప్రభువు. ఈ ప్రభువు పాలనమున పెక్కు దేవాలయములు విలసిల్లెను· ఈయన - మధుర, రామేశ్వరము, శ్రీవిల్లిపుత్తూరు, తిరునల్వేలిమండలములలో గల దేవాలయములను పునరుద్ధరించి, వానికి ప్రఖ్యాతిని గలిగించెను· దేవాలయములకు చుట్టును ప్రాకారములను నిర్మింపజేసెను. రామేశ్వరాలయమునకు గల ప్రాకారములు, ఆ ప్రాకారముల మధ్యగల మార్గములు ఈ ప్రభువుచే అత్యద్భుతముగ నిర్మాణము గావింపబడినవి· ఇంతేగాదు – సుచీంద్రము, తిరువనంతపురములలో గల దేవాలయములను ఈ మహాప్రభువే కళానిలయములుగ నిర్మింపజేసెను. ఈ రెండు దేవాలయములు మలయాళప్రాంతములో నున్నను, ఆ ప్రాంతములలోగల ఇతర దేవాలయములను పోలియుండక, విజయనగర ప్రభువుల నాటి కళాకౌశలమునే ప్రదర్శించుచున్నవి.

## తిరుమల - తిరుపతి

"కలౌ వేంకటనాయకః" అనెడి దివ్యవాక్యానుసారముగ, కలియుగ ప్రత్యక్షదైవముగ, భక్తకోటిచే నారాధింపబడుచున్న శ్రీ వేంకటేశ్వరస్వామి నిలయమగు తిరుమల దేవస్థానము భారతదేశ దేవాలయ చరిత్రలో ప్రత్యేకముగా సంస్తవనీయమైనట్టిది. ఇచ్చట యాత్రిక జనాభీష్ట సంసిద్ధ్యర్థము అవతరించిన శ్రీనివాసమూర్తి స్వయంవ్యక్తస్వామి· పురాణ ప్రసిద్ధిగల ఈ క్షేత్ర మాహాత్మ్యము ఋష్యాదులనుండి సామాన్యులవఱకు భక్తిప్రపత్తులతో, సభివర్ణింపబడుచున్నది. వినిర్మలమైన శేషగిర్యగ్రమున శ్రీ మద్వైఖానస మహాసూత్రానుసారముగ నర్చింప బడుచున్న ఈ పరంజ్యోతి స్వరూపుని శ్రీ మద్రామానుజాచార్యుల వారిట్లు సంస్తుతించిరి·

శ్లో ॥ అఖిలభువన జన్మస్థేమ భంగాదిలీలే
వినత వివిధ భూతవ్రాత రక్షైకదీక్షే ।
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥

—శ్రీ భాష్యారంభము.

శైవ వైష్ణవాది మత విభేదముల బోనాడి, సర్వ ప్రజానీకము ముక్తకంఠముగ ఈ వేంకటాచలపతి నభినుతించెడి దివ్యసిద్ధాంత మిచ్చట నిత్యనూతన శోభతో వెలుగొందుచున్నది.

ఈ దివ్యక్షేత్రమున గల శిల్ప శోభానమన్వితమైన దేవాలయ నిర్మాణము కడుంగడుహృద్యము, పుష్కరిణీ, పాపనాశనము, గోగర్భము, ఆకాశగంగ, కపిల తీర్థము మున్నగునవి ఈ క్షేత్రప్రభావము నుద్దీప్తము గావించు పుణ్యస్థలములు. దిగువ తిరుపతిలోగల శ్రీ గోవిందరాజస్వామివారి సన్నిధి, భక్తజన నయనానంద కరము. తిరుచానూరులో – శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయము విశిష్ట శిల్ప కళావైభవమున గుల్కుచుండును. కాలానుసారముగ ఈ క్షేత్రప్రతిపత్తి మిన్నంటినది. నేడు విశ్వమున కంతటికిని, ఆధ్యాత్మికజ్యోతిర్లీలారోచుల బ్రసరింప జేయగల పుణ్య నిలయమై, వేంకటాచలము దక్షిణభారతమున గణనీయపావన కీర్తికి నిధానమై నమస్త భక్తజన హృదయములలో శాశ్వత స్థానమును గడింపజాలినది.

నేటి కాలమున ఈ క్షేత్రాభివృద్ధి బ్రహ్మాండముగ జరుపబడి, విశ్వరూపమును దాల్చినది. సర్వవిద్యలు, సర్వకళలు, సర్వతోముఖ వికాసమును పొందుటకీ క్షేత్రము దివ్యావలంబనమైనది.

ధర్మదర్శనాదులతో సామాన్యప్రజలు మహదానంద నంభరితాంతఃకరణులగుచుండ, తదనుగుణమైన యాత్రిక సౌకర్యములుగూడ నమకూర్చబడి, పునః పునః స్వామి సందర్శనమును గాంక్షించెడి అభిరుచి భక్తుల హృదయములలో నభివృద్ధి నందుచున్నది.

సమర్థవంతమైన పరిపాలనము – ఘాటురోడ్డు – అనితర లభ్యములైన అసంఖ్యాక ప్రయాణ సౌకర్యములు అన్నింటిని మించిన మహత్తర ఫలదాయకమై శ్రీనివాసమూర్తి కటాక్షవీక్షణ పరంపర ఈ క్షేత్రప్రశస్తిని వివిధభంగుల ఎలుగెత్తి చాటుచున్నవి.

నిత్యకల్యాణముగా – పచ్చతోరణముగా శ్రీ వేంకటాచలము భక్తజన నయనములకు దర్శనమునిచ్చుచున్నది. సువర్ణవిమాన సందర్శన భాగ్యమును జీవితఫలముగా కోట్లాదియాత్రికులు భావించి యానందించుచున్నారు. దూర దూరములనుండియు తండోపతండములుగ వచ్చి, శ్రీస్వామివారికి నిలువుదోపిడినిచ్చి, అహంకారశూన్యులై నిలిచి, అనేకులు భవ సఫలతను గడించుచున్నారు.

''వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించ న వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥''

## శ్రీ కా ళ హ స్తి

ఇది ప్రసిద్ధమైన శివక్షేత్రము, నిశ్చల భక్తితో – జ్ఞానియైన మానవుడే కాక, క్రిమి కీటక జంతుజాలములుగూడ పరమేశ్వరుని యర్చించి తరించుట కవకాశముగలదని యీ క్షేత్రప్రశస్తి విశదీకరించును.

ఇచట పవిత్ర సువర్ణముఖీ నదీ ప్రవాహము గంభీర సుందరగమనమున గల గల ధ్వనుల జిలుకుచుండును.

సాలె పురుగు–సర్పము–దంతావళము సాంబశివ చరణస్మరణమున నిచట తరించినట్లు గాథ గలదు.

అటవికుడైన తిన్నడు శ్రీ కాళహస్తీశ్వరుని తన అకుంఠిత భక్తితో యిచటనే మెప్పించెను. ఇచటనే ధూర్జటి మహాకవి ప్రౌఢ మధుర పద్యపుష్పశతముతో – శ్రీ కాళహస్తీశ్వరుని అర్చించెను. చక్కని చిక్కని శిల్పసంపద యుట్టి పడెడి దేవాలయములు; గోపురము మున్నగు కట్టడములు – హృద్యాతి హృద్యములు.

తిరుమల–తిరుపతికి సమీపమున గల యీ పుణ్యక్షేత్రము చిత్తూరుమండలాంతర్గత మగు 'కాళహస్తి' యను పట్టణమున గలదు.

శైవాగమ పూజావిధులతో యిచ్చట అర్చనాకార్య కలాపము జరుపబడు చున్నది.

## శ్రీశైలము

"శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అనెడి శ్రీసూక్తి యొక్కటే శ్రీ శైల క్షేత్ర మహాత్మ్యము ను వ్యక్తీకరింపజాలును. ద్వాదశజ్యోతిర్లింగములలో నిచటగల లింగ మొకటిగా పరిగణింపబడుచున్నది. శ్రీ శైలము ఛత్రపతి శివాజీ మహారాజు కాలము నుండియు పునరుద్ధరణ శోభతో వెలుగొందుచున్న దివ్యక్షేత్రము. సిద్ధులు – వేదాంతులు – మహావిద్వాంసులు – పరమభక్తులు పలువురీ పుణ్యసీమలో దివ్యతపమున మల్లికార్జునుని పరిపూర్ణానుగ్రహమును బొంది తరించిరి. భ్రమరాంబా మహాదేవి ఆశ్రితవాత్సల్యవృష్టి గురియింపగల జగన్మాత. ఆ యాదిదంపతుల పావన దర్శన భాగ్యమును జీవిత మహాభాగ్యముగ సంభావించి, దుర్గమారణ్య ప్రాంతములందున్న ఈ పుణ్యదేవాలయమునకు లక్షలాదిగ యాత్రికులు వచ్చు చుందురు. ఈ క్షేత్రము కర్నూలుమండలమునం గలదు.

శ్రీశైల దేవాలయ పునరుద్ధరణ సంఘము నేడు చురుకుగా పనిని కొన సాగించుచు యాత్రికులకు సర్వ సౌకర్యములగూర్ప యత్నించుచున్నది. ఇంకను నిలువయున్న లక్షలకొలది ద్రవ్యముతో యీ క్షేత్రమున యెన్నియోవసతులు గల్పింపబడగలవు. ఇచట శైవాగమ సిద్ధాంతానుసారముగ నిత్యార్చనలు జరుగు చుండును.

## మంగళగిరి

శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి దేవాలయము గుంటూరుమండలాంతర్గత మైన మంగళగిరి యందున్నది. పెద్దగాలిగోపురము : భక్త వాంచితార్థసిద్ధిప్రదము

లగు పావన వీక్షణములు గల శ్రీ స్వామివారి దివ్యమూర్తి లావణ్యము, యాత్రికు లకు బ్రహ్మానందమును నంధించుచుండును.

కొండపై గల పానకాలస్వామి యీ దివ్యక్షేత్ర ప్రశస్తికి కారణభూతమైన దైవము. క్షేత్రపాలకుడు మారుతి. యాత్రికులు పానకమును బిందెల కొలదిగా స్వామివారికి సమర్పించి, మ్రొక్కుబడుల జెల్లించుకొనుచుందురు.

మ్రొక్కుబడిలో అర్థభాగము పానకమును సమర్పింపగనే, స్వామి-''భళ్ళు'' మని వెల్గ్రక్కునని భక్తుల విశ్వాసము. ఈ సత్యము నిచ్చట మనము కనులార గాంచ గలము. ఇందు వలన ఈ స్వామి పానకాలరాయుడు అని విఖ్యాతి నంది నాడు.

ఈ స్వామికి వైఖానససూత్రానుసారముగా నిత్యార్చనలు జరుపబడుచున్నవి.

## అల్లూరు

గుంటూరు మండలాంతర్గతమైన అల్లూరులో (బాపట్లతాలూకా) లక్ష్మీ నృసింహ స్వామివారి ఆలయము ప్రకృష్టమహిమలను నేటికిని వెదజల్లుచున్న దివ్య స్థలము.

ఈ స్వామి స్వయంవ్యక్త దైవమనియు – మహర్షులర్చించి రనియు – స్థలపురాణ కథ వలన వెలుగబడుచున్నది. ఇచట ప్రసిద్ధిగాంచిన యుత్సవము ''బారుగుండాలసేవ.''

గొప్ప ఆపదలలో నున్నవారు స్వామికి బారుగుండాలసేవను చెల్లించుకొందు మని మ్రొక్కుకొని, ఘోర కష్టములనుండి విముక్తులగుచుందురు.

శ్రీ స్వామివారికి అభిముఖముగ దేవాలయప్రాంగణమున నొక పెద్దగుండము సర్వదా త్రవ్వియుంచబడును.

మ్రొక్కుకొన్నవారు - ఉపవాసదీక్షతో స్వామికి అభిషేకము గావించుకొని గండదీపములు శిరమునబాల్చి సిద్ధముగ నుందురు.

స్వామి యావేశించిన అర్చకు లొకరు - వీరి నందరిని గుడిచుట్టును ప్రదక్షిణము జేయించి, నిప్పులతో జ్వలించుచున్న గుండముతో తాను ముందుండి నడచుచు వారి నందరిని ముమ్మారు నడిపించుకొని, స్వామి సన్నిధికి దీసికొని వెళ్ళును.

తదుపరి హారతి-ప్రసాద వినియోగము జరుగును. ఈ స్వామికి గూడ పానకము మహాప్రీతికరము. ఇట్టి బారుగుండాలసేవ నేడు గూడ—ఆస్తిక్యతత్త్వమునకు దైవమహిమకు-ప్రబలసాక్ష్యమై, అల్లూరులో జరుపబడుచునే యున్నది.

అతి పురాతన శిల్పశోభగల దేవాలయమిది. ప్రక్క భాగమునందొక శిథిల కూపము. ఇవియన్నియు యాత్రికులకు పవిత్ర పురాతన స్మృతులను జ్ఞప్తికిదెచ్చుచుండును.

ఇచట విఖనస సూత్రానుసారముగా నిత్యార్చనలు జరుపబడుచున్నవి. అర్చకులయం దొకరు ప్రతి తరమునను బ్రహ్మచర్యమును వహింతురు. ఈయన స్వామిసేవకు జీవితము సంకితము గావించి తరించును.

## ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై భక్తలోక సముద్ధరణార్థము వెలసియున్న కనకదుర్గా మహాదేవీ దివ్యసందర్శనము—యాత్రికులకొక స్వర్ణస్వప్నము.

సవ్యసాచి ఘోరతపమున దివ్యశక్తుల నీ యద్రి మీదనే సాధించినట్లు పురాణగాథలు స్పష్టీకరించుచున్నవి. కృష్ణవేణీమతల్లి తన తుంగతరంగ భంగిమలతో పావన దుర్గాపాద సరోజముల నర్చించుచున్నట్లు తీరు-భక్తలోక హృదయమున నేదో యొకానొక అవ్యక్తమైన రమ్యానుభూతిని గలుగ జేయుచుండును.

కృష్ణామండలాంతర్గతమైన విజయవాడయందీ దేవాలయము నేడు వినూతన శోభాపరంపరలతో విశేష మహిమలతో భక్తలోక చిత్తానంద సంధాయకముగా—వాంఛితార్థ ప్రదాయకముగా విరాజిల్లుచున్నది.

శైవాగమ సాంప్రదాయికమైన అర్చనా కార్యక్రమమిచట దేవీపూజలో నిత్యము వెలుగు లీను చుండును. ఇచట శర న్నవరాత్రమహోత్సవములు వైభవో

పేతములుగా – సకలకళాసంపదలతో తేజరిల్లుచు, యాత్రికులను మోదవారాశి దేల్చుచుండును.

## భద్రాచలము

" శ్రీరామ పాదాంకత్వాత్ భద్రాద్రి రితి విశ్రుతః "

పురాణ విశేషముల వలన అతిప్రాచీన పుణ్యక్షేత్రముగా నిర్ణయింపదగిన దివ్యస్థలము భద్రాచల సీతారామస్వామివారి దేవాలయము. ప్రవిమల గోదావరీ తటమున నిది నిర్మింపబడియున్నది

స్వామి విగ్రహములను పోకల దమ్మక్క తన స్వప్నఫలితముగ కన్నులారగాంచి, ప్రాంతీయ ప్రజల కెరుకపరచి, పూజలారంభించిన దీ పుణ్యసీమయందే.

17-వ శతాబ్దపు ఉత్తరార్థమున రామదాసుగా విశేషఖ్యాతి గడించిన కంచెర్ల గోవన్న, భద్రాచలమహాత్మ్యమును సర్వజనవేద్యము గావించెను.

సీతారామచంద్రమూర్తి మనసార నమ్మిన తన భక్తుల ఆర్తిని హరింపగల డనెడి పరమసత్యమునకు గోవన్న గాథ ప్రబలోదాహరణము. గోవన్న యన్న భద్రాచలక్షేత్రముగా-భద్రాచల క్షేత్రమన్న గోవన్నగా సంలీనమైన దివ్యచరిత్రము భద్రాచల పవిత్రచరిత్రము.

ఇచట శ్రీ పాంచరాత్ర దివ్యసూత్రాను సారముగా శ్రీ స్వామివార్ల అర్చనలు జరుపబడుచుండును. ఢిల్లీని ఔరంగజేబు పరిపాలించు కాలమున, తానాశాహి వంశీయులు (1620 - 1680) భద్రాచల ప్రాంతమునకు పాలకులు.

తానీషాకు ప్రత్యక్షమై, శ్రీరామచంద్రమూర్తి యిచట అపూర్వమైన భక్తలోకపరతను ప్రకటించెను. నాటినుండియు మొగల్ ప్రభువులను శ్రీ సీతారామ కల్యాణమహోత్సవమున-అనురక్తితో భాగస్వామ్యమును వహించుచుండిరి.

నేడు దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమము సర్వాంధ్ర ప్రజానీక సహకార సంపదలతో వన్నెలజివ్నెల దేలుచున్నది. గణపతిస్థపతి యను మహాశిల్పి యాధ్వర్య

మున ప్రాచీన కాలమున వచ్చిన వివిధశిల్పకళారీతుల సమష్టి స్వరూపనన్నివేశ ముగా నేడు భద్రాచలము దివ్యలావణ్యమున దేలియాడుచున్నది. కల్యాణమంటపాదులు పూర్తియైనవి.

గోపన్న కాలముననే – ''చుట్టూ ప్రాకారములు సొంపుతో'' గట్టింపబడెను. వాని కన్నింటికిని మేలిరూపములు గైసేయబడుచున్నవి.

పర్ణశాల - ఉష్ణగుండము - చిత్రకూటము మొదలైనవి దర్శనీయములు.

లక్షలాది యాత్రికులు శ్రీరామ కల్యాణశోభా సందర్శనార్థము - అనాది నుండియు-అహమహమికతో అరుగుదెంచుట–యీ క్షేత్రప్రశస్తి కొక ప్రబలచిహ్నము.

ఇచట స్వామివారికి రామదాసుచే సమర్పింపబడిన వివిధాభరణములు ప్రేక్షకలోకమునకు–ఆత్మానందమును నయన పర్వమును గూర్చు చుండును.

## రత్నగిరి

గోదావరీ మండలాంతర్గతమైన అన్నవరమునగల స్వయంవ్యక్తదైవమగు శ్రీ వీర వేంకట సత్యనారాయణస్వామివారు రత్నగిరిపై నధిష్టించియుండిరి. ఈ స్వామిని త్రిమూర్త్యాత్మకముగా భక్తలోకము సంభావించును.

ఏకకాలమున వేయిమంది భక్తులు శ్రీస్వామివారి వ్రతములు నిర్వహించుకొనుటకు వసతి సౌకర్యములు గావింపబడియున్నవి. భక్తాభీష్ట ప్రదుడైన యీస్వామికి వైశాఖశుద్ధ ఏకాదశికి బ్రహ్మోత్సవము జరుగును.

పండిత సన్మానములు – వేదాంతప్రసంగములు సంగీత సభలు మున్నగు వానితో శ్రీ స్వామివారి కల్యాణమహోత్సవము ప్రకృతిరామణీయకతను వెలార్చు దృశ్య పరంపరలమధ్య నయన పర్వముగా జరుపబడును.

## సింహాచలము

విశాఖ పట్టణ మండలాంతర్గతమైన సింహాచల క్షేత్రమున వరాహ నరసింహ స్వామివారు వేంచేసి యుండిరి. గిరిశిఖరము – ప్రశాంతవాతావరణము - ప్రర్వత

భాగముల కిరుపార్శ్వముల సర్వదా ప్రవహించెడి వారిధారా ద్వయము - ఈ క్షేత్ర మునకు దివ్యస్థల ప్రతిపత్తినే కాక – అతిలోక మోహన లావణ్య విభూతిని సైతము ప్రసాదించు చున్నవి.

విజయనగర పాలనమున సర్వరంగముల వర్ధమానమైన పుణ్యక్షేత్రమిది. చైత్రశుద్ధ పూర్ణిమకు కల్యాణోత్సవము, చందనయాత్ర యీక్షేత్రమున ప్రత్యేకోత్స వము. ఇచట దారుమూర్తితో స్వామి మనకు దర్శనమిచ్చును. స్వయం వ్యక్త స్వరూపము. ప్రవిమల పాంచరాత్రాగమ మహాసూత్రానుసారముగ-అర్చనా కలాప ములు నిర్వహింపబడుచున్నవి. ఆలయము సువిశాలము, రమణీయ శిల్ప కళా శోభితము. ఘాటురోడ్డు- వర్ణనాతీత ప్రకృతి సౌందర్యము-ఆగమపాఠశాల యాత్రికజనాకర్షకములై వెలుగులీనుచుండును.

దివ్యక్షేత్రముల వరుసలో సింహాచలక్షేత్రస్థానము పరిగణనీయము ప్రశంస నీయము.

కాకతీయుల పరిపాలనములో-ఓరుగల్లు హనుమ కొండలలోగల దేవాలయ ములు, మండపములు కళా నైపుణ్యమును వెదజల్లుచున్నవి.

ఓరుగల్లునకు సుమారుగ నేబదిమైళ్ళు దూరమునందున్న రామప్ప దేవాల యము సజీవశిల్పకళా వైచిత్రికి దర్పణమై సిద్ధహస్తుడగు శిల్పిని అమరుడా యని పింప జేయుచున్నది. ఆ నిర్మాణమున నుపయోగింపబడిన యిటుకరాళ్ళు నీళ్ళలో తేలునట!

అహోబిలము - అమరావతి - శ్రీకాకుళము - పొన్నూరు - బాపట్ల- ద్రాక్షా రామము-శ్రీకూర్మము మున్నగు దేవాలయములు పురాతనకాలమునుండియు భగవ దారాధనమునకు మూలస్థానములుగా ప్రఖ్యాతినిగావించినవి. శిల్ప కళా నైపుణికి వన్నెబెట్టినవి. ఇట్లెన్ని దేవాలయములను గూర్చియేని యుద్ఘాటింపవచ్చును.

అమృత జలధినుండి బిందువుల నెన్నియని యందింపగలము. అన్నియును మకరందమును స్పందించెడివే.

కాని — ఒక విషయము మాత్రము సుస్పష్టమగు చుండును. దక్షిణ భారతమునగల అన్ని దేవాలయములకును సమానముగ కొన్ని నియమములు, నిబంధనలు, చెక్కడములు గలవు. వాని సామ్యము నీ విధముగ బేర్కొనవచ్చును.

1. గర్భగృహము : ఇది అతి పవిత్ర గృహము. ఇందు మూల విరాట్ ప్రతిష్ఠింపబడును. ఇది అంధకారముచే నావరింపబడి యుండును. అందు వలననే గర్భాలయములలో అఖండ దీపమును వెలిగించు చుందురు. గర్భాలయ విమానమును కళాశోభితముగ నిర్మింతురు.

2. ముఖమంటపము : ముఖమంటపము గర్భగృహమున కెదురుగ నుండును. ఇది పూజకు, అభిషేకమునకు వినియోగపడును. ఈ మంటప ద్వార మున కిరుపార్శ్వములలో ద్వారపాలకు లుందురు. దీని కెదురుగ మహామంటపము లేక అర్థమంటపము ఉండును. దీని కెదురుగ ధ్వజ స్తంభము నెలకొల్పెదరు. ధ్వజ స్తంభమునకొక పార్శ్వమున బలిపీఠ ముండును. దాని కెదురుగ గాలిగోపురముండును. చుట్టును ఒకటిగాని, ఎక్కువగాని ప్రాకారములుండును. ప్రాకారములలోపలి భాగ మున, దేవాలయమునకు సమీప ప్రాంతమున పెక్కు తటాకములు, కూపములు ఉండును. వీటినే తీర్థములు లేక పుష్కరుణులందురు. తఱచు ప్రాకారములచుట్టు చిన్న చిన్న దేవతల-ఋషుల-ఆచార్యుల విగ్రహములను గాంతుము. తంజావూరు లోని బృహదీశ్వరాలయమునకు ఒకే ప్రాకారము గలదు. శ్రీరంగములోని శ్రీరంగ నాధుని దేవాలయమునకు సప్తప్రాకారములున్నవి.

దేవాలయములు మన నాగరికతను, సంస్కృతిని సమన్వయించి ఆధ్యాత్మిక తేజస్సుతో నిత్య శోభాయమానముగ వెలుగొందుచుండును. శిల్పులు తమ వాస్తు నైపుణ్యమును, శాస్త్రవిజ్ఞానమును, సాంకేతిక సామర్థ్యమును, శిల్ప సౌందర్యమును, చిత్రముల నిర్మాణ ప్రతిభను అత్యున్నత స్థాయిని బ్రకటించి, ప్రదర్శించిరి. ఇట్టి ప్రతిభా వంతములగు ప్రకటనములకు నేటి పాశ్చాత్య విధాన వాస్తుశిల్ప శాస్త్రము లందు ఆరితేరినవారు సుదూరులుగనే యున్నారు. నేటి వాస్తు శాస్త్రజ్ఞులు (కట్టడ నిర్మాతలు) ఒక్కరాతిని చెక్కి, కళావంత మొనర్చగలరా?

1. దేవాలయములు — దేవతారాధనమునకు సహకరించు పుణ్యక్షేత్ర ములు. ఇందు ఆత్మాత్మిక చింతనమును, నిశ్చలభక్తిని, పవిత్ర హృదయ వికాస మును బడయుటకు సముచితమగు వాతావరణము లభించును.

2. దేవాలయములు విజ్ఞాన ప్రజ్ఞానములకు నిలయములు. ఇట-గురుకుల ములు, విశ్వవిద్యాలయములు విలసిల్లుచుండెడివి. కంచి, చిదంబరములలోగల దేవాలయముల ప్రాకారముల పొడవునను విద్యార్థులు నివసించుటకు యోగ్యములగు చిన్న చిన్న గదులు నిర్మింపబడెను. అందరు విద్యార్థులకు ఉచితముగ నివాసము, భోజనము, విద్య లభించుచుండెడివి. విద్యార్థులు తమ గురువులకడ సామాన్య సరళ జీవితమును నిర్వహించుచు ఉన్నత విద్యను బడయుచుండెడివారు.

గురుశిష్యులకు వలయు నిత్యజీవిత నిర్వహణావసర వస్తువులను ఆనాటి రాజులు, భాగ్యవంతులగు దాతలు ఉచితముగ చేకూర్చుచుండెడివారు. వసతులను కలిగించుచుండెడివారు. విద్యార్థులకు వలయు దుస్తులు, గ్రంథములు, భోజనాది సౌకర్యములు ఉచితముగ లభించెడివి.

3. ఆపత్కాలములందు, యుద్ధ కాలములందు దేవాలయములు సామాన్య ప్రజలకు రక్షణ స్థానములుగ నుండెడివి. ఇట్టి తరుణములో తమ్మును, తమ యాస్తులను ప్రజలు యిందు దాచుకొని, సంరక్షించుకొనెడివారు. భూమిలోపలగల గదులలో వెండి బంగారములాది తమ ఆస్తులను దాచిపెట్టుకొనెడివారు. ప్రజలును సురక్షితముగ దాగియుండెడివారు.

4· దేవాలయములకు చుట్టును చిన్న చిన్న కుటీర పరిశ్రమములను పోషించు దుకాణములు పెక్కులుండును. ఇందు గ్రామప్రజల హస్తకౌశలమును, కళా నైపుణ్యమును బ్రదర్శించు వింత వింత వస్తువులను, చిన్న పెద్ద పుష్పమాలలను విక్రయించుచుందురు. చుట్టుపట్ల గల పెక్కు గ్రామముల ప్రజలు తమ వస్తువులను ఇటకు దెచ్చి, దూరప్రాంతములనుండి వచ్చు యాత్రికులకు విక్రయించుచుండెడివారు. ఈ విధముగ కుటీర పరిశ్రమలకు దేవాలయములు నిరంతరము పోషణము నొసంగుచుండెడివి. ఇంతేగాదు, కుటీర పరిశ్రమలు వృత్తిగాగలవారి యందుగల కళానైపుణ్యమును, నిరాణశక్తిని వర్థిల్లజేసి, సుఖజీవితమునకు దోహదమొనంగు చుండును.

5. వివాహాది పవిత్రకార్యములను దేవాలయములలో ఉచితముగ జరుపుకొనునదవకాశము సామాన్యప్రజలకు, పేదలకు సర్వదా లభించుచుండెడిది.

జాతియొక్క సర్వతోముఖవికాసమునకు – బహిరంగ, అంతరంగ, పారిశుద్ధ్య సంసిద్ధికి – సర్వ మానవ సమైక్య సత్ఫలప్రాప్తికి - ఆర్షధర్మమర్మావగాహన వైఖరికి ఆదిదేవసాక్షాత్కారసంపత్తికి - అఖండ వేదాంతజ్యోతి సందర్శనమునకు – ఆధార ప్రాయములుగ, ఆర్యావర్త మహత్తర దివ్యకీర్తికి పతాకలుగ వెలుగొందెడి దేవాలయ ముల పావిత్ర్యము, ప్రభావము వర్ణింప నలవి కానిది. కావుననే – "సౌందర్యమునకు రూపము నొసగుటకే కాక, దివ్యత్వమునకు ప్రేరణమును, విశ్వాసమునకు స్థాయిని యొసగుటకు హైందవ దేవాలయములు నిర్మింపబడినవి." అని 'విల్‌డ్యూరాంట్'. మహాశయులు చెప్పిన వాక్యము అక్షరాక్షర సత్యము లనదగియున్నవి.

దేవాలయములు లలితకళలకు, సంస్కృతికి మూలకారణములు. విజ్ఞాన ప్రజ్ఞానములకు గురుకులములు. వర్తక వ్యాపారములకు వసతి స్థానములు. సాంఘిక సదాచారములకు సదనములు. భిన్న భిన్న ప్రకృతులు గల ప్రజలకు సహకారము నందించు రక్షణాలయములు భిన్నప్రాంతముల, భిన్నాచారపరులుగ నున్న ప్రజలతో కలసి మెలసి. సఖ్యతను – బంధుత్వమును సమకూర్చుకొనుటకు. ఏకాదర్శపరులుగ, సదాచార శీల సంపన్నులుగ జీవించుటకు – ఉత్తమస్థానములుగ దేవాలయములు దీపించు చుండును. ఇవి భౌతిక, ఆధ్యాత్మిక వికాసములకు కీలకములు. సంఘీ భావమున కాయువుపట్టువులు. ప్రేమమునకు పవిత్ర నిలయములు.

విశ్వమున కంతటికి వేదాంత విజ్ఞానభిక్షను రెండు చేతులతో బంచిపెట్ట జాలిన మనపుణ్యభూమి యిట్టి దివ్య దేవాలయముల కాకరమై – అనాది నుండియు సభ్యజాతులలో నగ్రగణ్యము కాగలిగినది.

ఆర్యావర్త దేవాలయము లన్నియు మహదాశయసంసిద్ధి సూచకములై, మహత్తర మోక్షఫలదాయకములై. జగన్నాథునికి నిజమైన పూజామందిరములై, సర్వ రంగములలో జాతీయ కళామయముగ వెలుగొందుటకు దోడ్పడెడి ఆశీర్వాద సమ వృష్టిని గురియించినవి. ఇట్టి అపూర్వశక్తి యీ దేవాలయములలో స్వామిమూర్తుల యందు భాసమాన మగుట సత్యమని యీ క్రిందిశ్లోకము నిరూపించు చున్నది.

శ్లో ॥ స్థాపకస్య తపోయోగాత్ పూజాయాశ్చాతిశాయనాత్ ।
అభిరూప్యాశ్చబింబస్య దేవస్సాన్నిధ్యమృచ్ఛతి ॥

"స్థాపకులైన ఋషులు, యోగులు, మంత్రసిద్ధులు, భక్తులు మొదలగువారి తపశ్శక్తి వలనను, శాస్త్రోక్తమైన పూజాతిశయమువలనను, బింబముయొక్క పొందిక వలనను, భగవంతుడు దేవాలయములలో తన సాన్నిధ్యమును గల్పించుకొని ఐహికాముష్మిక ఫలములనిచ్చును."

ఇట్టి దివ్యవకాశమును భారతీయ దేవాలయము లందు నరు డందగలడు.

మహర్షుల దివ్యారాధనా బలముతో – యుగాంతరములలో సైతము చెక్కు చెదరక దివ్యదీధితులను ద్రవ్విపోయుచు, సాధకుల – అర్చనాపరుల అభీష్టములను ప్రసాదించెడి దేవాలయ శీతలచ్ఛాయల భారతీయ జీవితకల్ప వృక్షము-శాశ్వతముగ నవ వసంతశోభతో నితాంత కాంతి పుంజములను దిగంతములవరకు వెదజల్లగల పవిత్రభావ ప్రసూన సంతతుల సర్వదా ప్రసాదించుగాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు 1964 లో దేవస్థాన పాలక సంఘాధ్యక్షులుగా నున్నప్పుడు మొదటిసారి ముద్రింపబడినది.

సత్యము సర్వోత్తమ ధర్మము

అకారణ కోపము అనర్థహేతువు

తొందరపడి ఏ పని చేయరాదు

వివేకధైర్యములే విజయహేతువులు

అతిగర్వము హానికరము

మహాత్ములను అవమానించుట అపచారము

సత్ప్రయత్నము వీడరాదు

వాగ్దోషము ప్రాణహాని కారణము

క్షమ సర్వకార్య సాధనము

భగవంతుడు భక్తివశ్యుడు

ఆత్మస్తుతి పతనకారణము

ఆడి తప్పరాదు

దేవుని దూషించుట మహాపచారము

పెద్దవారిశక్తి చేటునకే కారణము

మూర్ఖత సకల వినాశకరము

ఇతరులను పరిహసింపరాదు

గొప్పవారితో స్పర్థపడరాదు

దీర్ఘవైరము కలవానికి కోపము కలిగింపరాదు

కృతఘ్నత మహాదోషము

కోపము కలవారితో సంబంధము అనర్థదాయకము

ఆపదలో ఆదుకొన్నవాడే ఆప్తుడు

తల్లిదండ్రులు, గురుదైవసమానులు

అన్నము పరమాత్మస్వరూపము ; దానిని నిర్లక్ష్యము
చేయరాదు.

విద్యవలన వినయము, వినయమువల పాత్రత దానివలన
మానవుడు ఇహపరసుఖములు పొందగలడు.

సత్యము సర్వోత్తమ ధర్మము

అకారణ కోపము అనర్థహేతువు

తొందరపడి ఏ పని చేయరాదు

వివేకధైర్యములే విజయహేతువులు

అతిగర్వము హానికరము

మహాత్ములను అవమానించుట అపచారము

సత్ప్రయత్నము వీడరాదు

వాగ్దోషము ప్రాణహాని కారణము

క్షమ సర్వకార్య సాధనము

భగవంతుడు భక్తివశ్యుడు

ఆత్మస్తుతి పతనకారణము

ఆడి తప్పరాదు

దేవుని దూషించుట మహాపచారము

దేవాలయములు లలిత కళలకు సంస్కృతికి పోషణ కేంద్రములు. విజ్ఞాన ప్రజ్ఞానములకు గురుకులములు. భౌతికాధ్యాత్మిక వికాసములకు కీలకములు. సంఘీభావమున కాయువుపట్టులు. పవిత్ర ప్రేమకు నిలయములు. ఆది దేవ సాక్షాత్కార సంపత్తికి అఖండ వేదాంత జ్యోతి సందర్శనమునకు ఆధార ప్రాయములు.

*

T. T. D. PRESS, TIRUPATI. C. 10000—2-7-79.